క్లుప్తంగా

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



లచ్చుంనకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామానికి చెందిన వలంటీర్ పి.జానకీరామ్ విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి శనివారం పింఛన్ అందజేశారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఎస్.లచ్చుం కొద్ది రోజులుగా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి మరీ పింఛన్ అందజేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పలగర గ్రామానికి పింఛన్ లబ్ధిదారు సీతమ్మ బొబ్బిలి ఆస్పత్రిలో తన భర్తకు సహాయంగా ఉండిపోవడంతో, వలంటీర్ ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశాడు.

సంతాపం



మౌనం పాటిస్తున్న ఉద్యోగులు

పార్వతీపురం: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్యను ఖండిస్తూ రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, నిందితుడ్ని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. భూ వివాదాలున్న మండలాల తహసీల్దార్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్డీసీ జి.కేశవనాయుడు, ఇన్‌చార్జ్ ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సారా ప్యాకెట్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో రూరల్ ఎస్సై వెంకటరమణ, సిబ్బంది

సాలూరు: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు చంద్రంపేట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా పురోహితునివలస గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, జోగేశ్వరరావు ఆటోలో వెయ్యి సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆటోను సీజ్ చేశామని, ముద్దాయిలను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సారా మహమ్మారిని నిర్మూలిద్దాం..



మాట్లాడుతున్న సీఐ జి.డి.బాబు

సాలూరు: అందరి సహకారంతో సారా మహమ్మారిని శాశ్వతంగా తరిమికొడదామని సీఐ జీడీ బాబు అన్నారు. పట్టణంలో పెద్దవీధిలో శనివారం సారా మహమ్మారి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సారా తయారీ, తరలింపు, అమ్మకం వంటివి చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత సారాకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు.

మజ్జిగ ద్రావణం పిచికారీతో ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం: పుల్లని మజ్జిగను నీటితో కలిసి జీడిమామిడి తోటల్లో పిచికారీ చేయడం వల్ల పూత, పిందె నిలబడడమే కాకుండా ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు వంటి తెగుళ్లు దరిచేరవని జిల్లా ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ (ఎన్ఎఫ్ఏ) జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామంలోని జీడిమామిడి రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ ద్రావణం తయారీపై శనివారం ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఒక ఎకరా జీడిమామిడి తోటకు వంద లీటర్ల నీటికి ఆరు రోజులు పులియబెట్టిన ఆరు లీటర్ల పుల్లటి మజ్జిగను కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంటీ జి.నిర్మలాదేవి, సిబ్బంది ఢిల్లేశ్వరరావు, పరశురాం, వెంకటేష్ ఉన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే..
మళ్లీ జగనే సీఎం కావాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్
- అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీ చేయకుండా మోసం చేసిన టీడీపీ
- వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు సరైన గౌరవం
- ఆసరా సంబరాల్లో డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: రాష్ట్రం, ప్రజలు బాగుండాలంటే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రం మక్కువలో ఎంపీడీఓ పి.దేవకుమార్ అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర ముఖ్య అతిథిగా హాజరై మహిళా సంఘాలకు ఆసరా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు గద్దెనెక్కారని, అధికారంలోకి వచ్చాక హామీ అమలు చేయకుండా మహిళలను మోసం చేశారని దుయ్యబట్టారు. బాబు వస్తే జాబు వస్తుందన్నారు.. కానీ ఒక్కరికి కూడా ఉద్యోగాలు రాలేదు. నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు కాబట్టే 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీని తిరస్కరించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో అబద్ధపు హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం వారి రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. వచ్చే నెలలో వైఎస్సార్ చేయూత పథకం కింద మహిళలకు రూ.18750లు అందించనున్నట్లు చెప్పారు. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, ఫీజు రీఇంబర్స్‌మెంట్, వైఎస్సార్ చేయూత, ఆరోగ్యశ్రీ తదితర పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తప్ప సామాన్య ప్రజలకు ఎవరికైనా ఇంతలా మేలు జరిగిందా అని ప్రశ్నించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని, ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఆసరా సంబరాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా డాన్సులు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంటి రామలక్ష్మి, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు గూనాన అర్జునమ్మ, సాలూరు, మక్కువ వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీను, పూడి దాలినాయుడు, పెంట సంజీవునాయుడు, రెడ్డి కృష్ణంనాయుడు, కోట్ల నారాయణరావు, వెలుగు ఏపీఎం సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

ఆకట్టుకున్న విద్యార్థులు



నవరత్నాలపై నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఆసరా సంబరాల్లో భాగంగా మండలంలోని బంగారువలస పాఠశాలకు చెందిన చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. గోపీక అనే విద్యార్థిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాల పథకాలతో ప్రజలకు జరిగిన సంక్షేమాన్ని కళ్లకు కట్టినట్లు వివరించింది. అలాగే నవరత్నాలపై చిన్నారులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. చిన్నారులను, ఉపాధ్యాయులు సత్యవతి, అరుణలను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మావుడి సోదరులు శ్రీనివాసరావు, రంగునాయుడు అభినందించారు.

భోజనాలు వడ్డించిన డిప్యూటీ సీఎం

మక్కువ: వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొనేందుకు వేలాది మంది మహిళలు తరలివచ్చారు. వారికి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు మావుడి శ్రీనివాసరావు, రంగునాయుడు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర స్వయంగా భోజనాలు వడ్డించారు. హోదాను పక్కనపెట్టి భోజనాలు వడ్డించడంతో అక్కచెల్లెమ్మలు సంతోషం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



ఆర్బీకే శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- పణుకుపేటలో ఆర్‌బీకే భవనం ప్రారంభం

సీతానగరం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కాశీపేట సచివాలయం పరిధిలోని పణుకుపేటలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనాన్ని సర్పంచ్ బంకులు పద్మావతి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు జె. రాజమణి ఆధ్వర్యంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్‌బీకేలు ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే చాలా ఆర్బీకేలకు సొంత భవనాలు నిర్మించామని తెలిపారు. కేంద్రాల్లో విజ్ఞాన సదస్సులు నిర్వహించి, రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డివిజనల్ పీఆర్ డీఈఈ ఎం. రత్నకుమార్ మాట్లాడుతూ, పార్వతీపురం నియోజకవర్గంలోని పూర్తయిన భవనాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, మాజీ ఎంపీపీ కె. రత్నాకరరావు, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్. నిర్మల, మాజీ సర్పంచ్ బంకులు శ్రీనివాసరావు, జగన్నాథంనాయుడు, మండల ఏఓ ఎస్.అవినాష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతిరావు, మండల ఇంజినీరింగ్ అధికారి జి. చంద్రమౌళి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సీఈఓలు, వ్యవసాయ సహాయకులు జె.విక్టర్, బి. శ్రీహరినాయుడు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, గృహసారథులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

సీతానగరం: మండలంలోని ఫణుకుపేటకు చెందిన అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం చీరలు, రూ. 500 చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తనకు ఇస్తున్న జీతాన్ని పేదల కోసం వినియోగిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అక్కచెల్లెమ్మలకు ఏదో ఒక రూపంలో వితరణ చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బి. పద్మావతి, మాజీ సర్పంచ్ జె. రాజమణి, శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పార్థసారథి, టి. శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ ధనంజయరావు, మాజీ సర్పంచ్ బి. భాస్కరరావు, ఎం. ప్రభాకర్‌నాయుడు, ఎంపీటీసీ శనపతి నిర్మల,పాడువు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అక్కచెల్లెమ్మలకు చీర, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు.

జగనన్నను మరోసారి గెలిపించుకోవాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్:

రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. మరికి పంచాయతీ పరిధిలో గల ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో గెలిచేందుకు కల్లబొల్లి కబుర్లు చెప్పే గారడీ గాళ్లు గ్రామాల్లోకి వస్తుంటారని, వారి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున బూత్‌స్థాయి పార్టీ క్యాడర్ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. పంచాయతీ పరిధిలో గల నాలుగో పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో చర్చిస్తూ.. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి, విధానాలపై సూచనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌తో ముడిపడి ఉందన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి గెలుపు కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బలగ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమరవపు కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ వెంపల గురురాజు, ఆత్మ చైర్మన్ తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మజ్జి శేఖర్, బి. త్రినాథ, తుమరాడ పకీరునాయుడు, జి.రమేష్, ఆర్. సోమశేఖర్, బి.దుర్గారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు టీఆర్‌ఎఫ్ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీఆర్‌ఎఫ్ నాయకులు

కురుపాం: మండలంలోని నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయొద్దని తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌ను ట్రైబల్ రైట్స్ ఫోరం(టీఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలోని మొండెంఖల్ గ్రామానికి సంబంధం లేని కొంతమంది వ్యక్తులు మన్నం దొర కుల ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, వాళ్లు ఎస్టీ కాదని డీఎల్ఐసీ నిర్ధారణ చేసిందన్నారు. బీసీ కులానికి చెందినవారు కనుక కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయొద్దని కోరారు.

తహసీల్దార్‌పై ఆరోపణలు

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దార్‌గా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన జే రాములమ్మ సామాజిక మాధ్యమంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు పలువురితో కలిసి శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సర్టిఫికెట్ మంజూరు కోసం లంచం అడిగారని ఆరోపించారు. తహసీల్దార్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో పార్టీలో చేరిన 12వ వార్డు ప్రజలు

పార్వతీపురం టౌన్: ప్రతిపక్ష పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి ఇటీవల కాలంలో టీడీపీలో చేరిన 12వ వార్డుకు చెందిన పలువురు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీతో ఒరిగిందేమీ లేదని గ్రహించి వారంతా తిరిగి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంప్ కార్యాలయంలో శనివారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పసుమర్తి శ్రీరామ్మూర్తి, పసుమర్తి సంతోష్‌కుమార్, మోనంగి దుర్గాప్రసాద్, మోనంగి వాసుదేవరావు, పిల్లి జగదీశ్వరరావు, గంట శంకర్రావు, డి. దాసు, కళింగ లక్ష్మి, టి. రోజా, పసుమర్తి కిశోర్, పిల్లి శివాజీ, పిల్లి ఏకాసు, తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని.. ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా మోసపోయే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తాడ్డి శంకర్రావు, షఫి, జలాల్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

‘అభిలాష’తో నిరుద్యోగులకు మేలు

- డ్వామా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ‘అభిలాష’ సామాజిక గ్రంథాలయాలతో నిరుద్యోగులకు ఎంతో మేలు చేకూరుతుందని డ్వామా పీడీ కె. రామచంద్రరావు అన్నారు. మండలంలోని కాశీపేట పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సామాజిక ‘అభిలాష’ గ్రంథాలయాన్ని మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీడీ రామచంద్రరావు మాట్లాడుతూ, నిరుద్యోగులు ఇటువంటి గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోందని చెప్పారు. జిల్లాలో మొదటిగా 66 రకాలకు చెందిన 12,804 పుస్తకాలతో 97 పంచాయతీ కార్యాలయాల్లో అభిలాష సామాజిక గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, డిజిటల్ సహాయకులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో డ్వామా జిల్లా పీడీ రామచంద్రరావు, తదితరులు

త్వరితగతిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

- మున్సిపల్ కమిషనర్ సింహాచలం

పార్వతీపురం టౌన్: జగనన్న లే అవుట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషన్ పి.సింహాచలం అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సింహాచలం

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- టీడీపీ నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదా?
- అభివృద్ధిపై టీడీపీ నాయకులు చర్చకు సిద్ధమా..
- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా మారాయని, వాటిని ప్రారంభించేందుకు ఇతర రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలోని మక్కువలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే నూతన భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే సచివాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారు రూ.41 లక్షలతో మక్కువ-2 సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్‌బీకేను నిర్మించడం జరిగిందన్నారు. ప్రతీ పంచాయతీలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, సీసీరోడ్లు, కాలువలు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పించినట్లు చెప్పారు. మక్కువ నుంచి సాలూరు వరకు రహదారి నిర్మాణానికి సుమారు రూ.56 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. అనసభద్ర సమీపంలో రూ.12 కోట్లతో ఏకలవ్య పాఠశాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మక్కువ, శంబర గ్రామాల్లో రెండు ప్రభుత్వ ఆస్పత్రులు, మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, 2019 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఆర్పీ బంజ్‌దేవ్, ఆరేళ్లు ఎమ్మెల్సీగా, ఎస్టీ కమిషన్ సభ్యురాలుగా, శిశు సంక్షేమశాఖ రీజనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణి ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంటి రామలక్ష్మి, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు గూనాన అర్జునమ్మ, ఉప సర్పంచ్ కొల్లి చిన్నయ్య, ఎంపీడీఓ పి.దేవకుమార్, ఏఓ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.